సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 29 । సెప్టెంబర్ । 2022

అనంతగిరి 'హరిత'కు అవార్డు ప్రదానం



అనంతగిరి: పర్యాటకశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న హరిత రిసార్ట్స్‌కు అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తిరుపతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా అనంతగిరి హరిత మేనేజర్ బద్రీ ఈ అవార్డును అందుకున్నారు. సేవలు, ఆదాయం, పర్యాటకుల నుంచి ప్రశంసలు పొందడంలో అనంతగిరి హరిత ముందుస్థానంలోని ఉన్నందున అవార్డు అందజేశారు.

జెడ్పీ సీఈవోగా శ్రీరామ్మూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా పి.శ్రీరామ్మూర్తిని నియమించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శ్రీరామ్మూర్తి అల్లూరి సీతారామరాజు జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేస్తున్నారు.

న్యూస్‌రీల్

కాఫీ,అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర

జీసీసీ ఎండీ సురేష్ బాబు



గొందిపాడులో కాఫీ రైతులతో మాట్లాడుతున్న జీసీసీ ఎండీ సురేష్‌బాబు

జి.మాడుగుల: అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు, కాఫీ, మిరియాలకు **జీసీసీ గిట్టుబాటు ధర** కల్పిస్తోందని **గిరిజన సహకార సంస్థ మేనేజిం**గ్ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని సొలభం పంచాయతీ గొందిపాడు, కంఠవరం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి, గిరిజన రైతులతో మాట్లాడారు. కాఫీ, మిరియాల కొనుగోలు ధర పెంచినట్టు చెప్పారు. దళారుల బారిన పడి నష్టపోకుండా గిరిజన రైతులు తమ ఉత్పత్తులను జీసీసీకి విక్రయించాలని ఆయన సూచించారు. లక్ష్యాన్ని అధిగమించి అటవీ వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయాలని పాడేరు జీసీసీ డీఎం పార్వతమ్మ, జీసీసీ బ్రాంచి మేనేజర్‌ను ఆయన ఆదేశించారు. జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్, కొత్తూరు సమీపంలో ఇండియన్ గ్యాస్ గొడౌన్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాడేరు జీసీసీ డీఎం కె.పార్వతమ్మ, జీసీసీఎంఎస్ బ్రాంచి మేనేజర్ కొండన్న,సూపరింటెండెంట్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌కు సేకరించిన భూముల పరిశీలన



జి.మాడుగులలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్

జి.మాడుగుల: జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించిన భూములను పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ బుధవారం పరిశీలించారు. మండలంలో బలమానువంక, కులుపాడు,పెదఉరుము, జి.మాడుగుల గ్రామాల్లో హైవే అవార్డు ఎంక్వైరీ నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు నష్టపోతున్న రైతులతో ఆయన మాట్లాడారు. ఎన్‌హెచ్ నిర్మాణం కారణంగా కులుపాడు గ్రామంలో పాఠశాల, ఇళ్లు దెబ్బతింటున్నాయని, రహదారి ఎలాట్‌మెంట్ మార్పు చేయాలని సబ్ కలెక్టర్‌కు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపుతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.అప్పలస్వామి, వీఆర్వో కుమారి తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎంటీ శ్రీను

జి.మాడుగుల: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో తరలిస్తుండగా మార్గ మధ్యంలో మగశిశువుకు జన్మనిచ్చింది. మండలంలో వంతాల పంచాయతీ గంటరాయి గ్రామానికి చెందిన ఆర్.వరలక్ష్మికి బుధవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనంలో వరలక్ష్మిని జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో గొడుగుమామిడి గ్రామం వద్ద ప్రసవించినట్టు ఈఎంటీ శ్రీను, పైలెట్ లక్ష్మణ తెలిపారు.తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారని, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని వారు చెప్పారు.

పర్యాటక బోట్ల తనిఖీ

దేవీపట్నం: పాపికొండల పర్యటనకు గోదావరిపై నడిపే పర్యాటక బోట్లను ఏపీటీడీసీ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. గోదావరి వరదల కారణంగా పాపికొండల విహార యాత్రను రెండు నెలల కిందట నిలిపివేశారు. గోదావరి వరద పరిస్థితులు పూర్తిగా తగ్గిన తర్వాత పాపికొండలకు వెళ్లే బోట్లకు అధికారులు అనుమతులు మంజూరు చేయాల్సిఉంది. ఈ నేపథ్యంలో పోశమ్మగండి వద్ద పాపికొండలకు తిరిగే 14 బోట్లలో 5 బోట్లను ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, జాయింట్ మేనేజర్ పవన్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ గంగబాబులు బుధవారం తనిఖీ చేశారు. బోట్ల సామర్థ్యం, ఫిట్‌నెస్ తదితర అంశాలను పరిశీలించారు.

మాతాశిశువులకు భరోసా

- జిల్లాలో విస్తృతంగా వైద్యసేవలు
- మరణాల నిరోధానికి ప్రత్యేక చర్యలు
- అంగన్‌వాడీ సిబ్బంది భాగస్వామ్యం

సాక్షి, పాడేరు: మాతాశిశుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా జిల్లాలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సిబ్బంది భాగస్వామ్యంతో ఆరోగ్య సేవలను పెద్ద ఎత్తున అందజేస్తున్నారు. ఐసీడీఎస్ అధికారులు, వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని 22 మండలాల్లో 62 ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. జిల్లాలో 90శాతం గిరిజన జనాభాయే. గిరిజన గ్రామాల్లోనే మాతాశిశు మరణాలు గతంలో అధికంగా ఉండేవి. వైద్యఆరోగ్య కార్యక్రమాలకు కూడా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలోను మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ముఖ్య గ్రామాల్లోని ఉప ఆరోగ్య కేంద్రాల వైద్య బృందాలు నిరంతరం మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలపైనే దృష్టి సారిస్తున్నాయి. సచివాలయాల్లో ఏఎన్ఎంలు కూడా చురుగ్గా పనిచేస్తున్నారు.

అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలో 3214 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 1,791 మెయిన్ కేంద్రాలు, 1,423 మినీ కేంద్రాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,23,104 మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఉన్నారు. వారందరీ నెలలో రెండుసార్లు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారు. గర్భం దాల్చిన సమయం నుంచి సుఖ ప్రసవం అయ్యే వరకు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి బుధ, శనివారాల్లో మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నెలలు నిండిన సమయంలో ముందుగానే దగ్గరలోని ఆస్పత్రులకు గర్భిణులను తరలిస్తున్నారు. అన్ని పీహెచ్‌సీల్లోను బర్త్ వెయిటింగ్ రూములను కూడా ప్రభుత్వం అందుబాటులో తెచ్చింది. దీంతో ప్రసవానికి ముందే ఆస్పత్రులకు చేరుకుంటున్న గర్భిణులకు సుఖ ప్రసవం అయిన తర్వాత మూడు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉంచి వైద్య సేవలు కల్పిస్తున్నారు. అలాగే 5ఏళ్ల లోపు చిన్నారులందరికీ ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. పుట్టిన బిడ్డల బరువును పరిశీలిస్తూ అవసరం మేరకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. ప్రతి గ్రామంలోని గర్భిణి, బాలింత, చిన్నారుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మాతాశిశు మరణాలు తగ్గుముఖం పడుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.



గుర్రగరువులో బాలింత ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర వివరాలు

మండలాలు	22
ఆరోగ్య కేంద్రాలు	62
జిల్లా ఆస్పత్రి	01
ఏరియా ఆస్పత్రులు	03
కమ్యూనిటీ ఆస్పత్రులు	04
అంగన్‌వాడీ కేంద్రాలు	3,214
గర్భిణులు	11,460
బాలింతలు	10,958
3ఏళ్లలోపు చిన్నారులు	56,260
3నుంచి 6ఏళ్లలోపు చిన్నారులు	44,426



గర్భిణికి బీపీ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తల్లీబిడ్డల ఆరోగ్య రక్షే లక్ష్యం



తల్లీబిడ్డల ఆరోగ్యరక్షే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. దీనికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు కల్పిస్తున్నాం. నెలలు నిండిన గర్భిణులను ఆస్పత్రులకు తరలించి సుఖ ప్రసవాలకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ఆస్పత్రుల్లోను 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. బర్త్ వెయిటింగ్ రూముల్లో కూడా సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది.

– డాక్టర్ బి.సుజాత, డీఎంహెచ్‌వో, పాడేరు.

అంగన్‌వాడీ సిబ్బంది భాగస్వామ్యం



అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఐసీడీఎస్ సిబ్బంది వైద్య ఆరోగ్య బృందాలతో సమన్వయం చేస్తూ మాతాశిశు సంరక్షణకు కృషి చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వైద్య పరీక్షల నిర్వహణలో అంగన్‌వాడీ సిబ్బంది కూడా భాగస్వాములవుతున్నారు. రక్తహీనతతో ఉన్న గర్భిణులకు, బరువు తక్కువ ఉన్న చిన్నారులకు అదనపు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నాం.

–సూర్యలక్ష్మి, ఐసీడీఎస్, పీడీ, అల్లూరి సీతారామరాజు జిల్లా

అటవీశాఖ కార్యాలయాలు ప్రారంభం



జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వినోద్‌కుమార్

- జిల్లా అటవీశాఖ అధికారిగా వినోద్‌కుమార్
- చింతపల్లి, రంపచోడవరం డీఎఫ్‌వోలుగా సూర్యనారాయణ, జీజీ నరేంద్రన్ బాధ్యతల స్వీకరణ



చింతపల్లిలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ

సాక్షి,పాడేరు/చింతపల్లి/రంపచోదరం: అటవీశాఖ పునర్విభజనలో భాగంగా పాడేరు కేంద్రంగా అటవీశాఖ జిల్లా కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చింతపల్లి, రంపచోడవరాల్లో కొత్తగా ఫారెస్ట్ డివిజన్లు ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారిగా వినోద్ కుమార్, రెండు డివిజన్ల డీఎఫ్‌వోలుగా సూర్యనారాయణ, జీజీ నరేంద్రన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కార్యాలయంతో పాటు డివిజన్ కార్యాలయాలను ఆయా అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతం పాడేరు డీఎఫ్‌వోగా పనిచేస్తున్న వినోద్‌కుమార్‌నే జిల్లా అటవీశాఖ అధికారిగా ఆ శాఖ ఉన్నతాధికారులు నియమించారు. పాడేరు డీఎఫ్‌వో కార్యాలయం జిల్లా అటవీశాఖ కార్యాలయంగా అప్‌గ్రేడ్ అయింది. ఈ సందర్భంగా పలు రేంజ్‌ల అటవీశాఖ అధికారులు, ఇతర సిబ్బంది.. జిల్లా అటవీశాఖ అధికారి వినోద్‌కుమార్‌ను పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

నూతనంగా ఏర్పడిన చింతపల్లి అటవీ డివిజన్ పరిధిలో అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని బుధవారం బాధ్యతలు స్వీకరించిన డీఎఫ్‌వో సూర్యనారాయణ తెలిపారు. భూములు, అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని రంగురాళ్ల తవ్వకాల నివారణకు కఠిన చర్యలుచేపడతామన్నారు. డివిజన్‌లో 240 మంది ఉద్యోగులు అవసరం కాగా, ప్రస్తుతానికి 93 మంది ఉన్నారని చెప్పారు. ఇప్పటి వరకు 74,397 మంది గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారులు శ్రీనివాస్ పాత్రుడు, భార్గవ వర్మ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన రంపచోడవరం ఫారెస్టు డివిజన్ అధికారి నరేంద్రన్‌తో సిబ్బంది

నిబద్ధతతో పనిచేయాలి

రంపచోడవరం అటవీ డివిజన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జి.జి. నరేంద్రన్ మాట్లాడుతూ అడవుల సంరక్షణకు సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. ఈ డివిజన్ పరిధిలో 11 మండలాలతో పాటు పాపికొండల జాతీయ పార్క్, వన విహారి, గుడిసె తదితర పర్యాటక ప్రాంతాలున్నాయని చెప్పారు.

డివిజన్‌లో పోక్సుపేట, ఇందుకూరు, మారేడుమిల్లి రేంజ్‌లు ఏర్పాటైనట్టు తెలిపారు. వాటికి రేంజ్ అధికారులుగా ఎం.కరుణాకర్, దుర్గా కుమార్ బాబు, బి.వి.డి. ప్రసాద్‌లు బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. నేరాలపై సబ్ డీఎఫ్‌వో నంబర్ 8985078050కు సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. రంపచోడవరం సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారిగా ఎస్.భరణి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫారెస్టు అధికారులు డి.లలితకుమారి, ఎం.అబ్బాయిదొర, జి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో జాప్యం ఉపేక్షించం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు పనుల్లో జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదని, నిధులు దుర్వినియోగమైతే బాధ్యుల నుంచి రికవరీ చేస్తామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయం నుంచి పాడేరు డివిజన్‌లోని 11 మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా రెండవ దశ మనబడి నాడు-నేడు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలతో పాటు మొదటి దశలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులపై పీవో సమీక్షించారు. పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాడు-నేడు పనుల నిధులను సక్రమంగా వినియోగించాలని, చేసిన పనులకు చెక్కు లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా చెల్లింపులు చేపట్టాలన్నారు. నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తిస్తే రికవరీ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గుర్తించిన పనులను వెంటనే చేయాలన్నారు. జీకే వీధి-సీలేరు రోడ్డులోని కల్వర్టుల నిర్మాణాలను ఈ నెల 29నుంచి ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో పి.రమేష్, గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, పీఐయూ ఈఈలు డి.వి.ఆర్.ఎం. రాజు, కొండయ్య పడాల్, లావణ్యకుమార్, ఉపాధిహామీ ఏపీడీ జె.గిరిబాబు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని, ఎంఈవో సరస్వతీదేవి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

జెండాకొండ అభివృద్ధికి చర్యలు

హుకుంపేట: ఏజెన్సీలో అత్యంత ఎత్తైన జెండా కొండ (సీతమ్మ పర్వతం) ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓలుబెడ్డ గ్రామం నుంచి జెండా కొండ వరకు రోడ్డు సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. కొండవద్ద వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, మంచినీరు, పర్యాటకుల విశ్రాంతి భవనాలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల్లోగా ప్రతిపాదనలు, ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ రాజుబాబును కోరారు. శోభకోట పంచాయతీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన పోషకాహారం అందజేయాలని సూచించారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రంలో సిబ్బంది విధులు, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, స్థానిక సర్పంచ్ మర్రి చిన్నారావు,ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కొర్ర నాగరాజు,నాయకులు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి: పర్యాటక ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా పంచాయతీరాజ్ అధికారి పి.ఎస్.కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. పర్యాటక సీజన్ ప్రారంభం అవుతున్నందున ఆంధ్రాకశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిలో పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామన్నారు. శని, ఆదివారాల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున మహిళా పోలీసుల సేవలు వినియోగించుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యాటకుల నుంచి నగదు వసూలు చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే టెంట్లు, హోటళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళా పోలీసులతో పాటు పర్యవేక్షిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్

- 40 వేల డోసులు సిద్ధం
- ఒడిశాకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోని పశువులకు ముందుగా టీకాలు
- పశుసంవర్ధక శాఖ ఏడీ రాజా రవికుమార్

పెదబయలు: లంపీ స్కిన్ వ్యాధి నివారణకు జిల్లా పరిధిలో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రాజా రవికుమార్ తెలిపారు. మండలంలోని సీతగుంట పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో లంపీ స్కిన్ వ్యాధి నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా లక్ష డోసుల వ్యాక్సిన్ కావాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించినట్టు చెప్పారు. 40 వేల డోసులు అందుబాటులోకి వచ్చినట్టు ఆయన తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో ఎక్కువగా ఈ వ్యాధి ఉందని, ఒడిశా నుంచి కొనుగోలు చేసిన పశువుల ద్వారా మన జిల్లాలో సరిహద్దు గ్రామాల్లో పశువులకు వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల ముందుగా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో వ్యాక్సిన్ వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని,పెదబయలు మండలం నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. మండలంలోని కొరవంగి గ్రామంలో ఓ ఎద్దుకు లంపీ స్కిన్ వ్యాధి సోకిందని, దానికి చికిత్స చేస్తున్నామని చెప్పారు. రైతులు పశువులు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మందలో ఒక్క పశువుకు వస్తే మిగిలిన పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉందని చెప్పారు. వ్యాధి ఉన్నట్టు గమనించిన వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.



మాట్లాడుతున్న ఏడీ రాజా రవికుమార్

పశువుల రవాణాకు అడ్డుకట్ట వేయాలి

ఒడిశా రాష్ట్రం నుంచి మన రాష్ట్రంలోకి పశువుల రవాణా జరగకుండా నిరోధించాలని కలెక్టర్, ఎస్పీలను కోరినట్టు చెప్పారు. వ్యాధి ప్రబలిన పశువుల మాంసం తింటే మనుషులకు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ప్రతీ గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

గిరిజన విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

అరకులోయ: రాష్ట్రస్థాయి ఏకలవ్య పాఠశాలల క్రీడాపోటీలు అరకులోయలో నిర్వహించడం సంతోషంగా ఉందని, గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా సత్తా చాటాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు తెలిపారు. మూడు రోజుల పాటు అరకులోయలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. 28 ఏకలవ్య మోడల్ పాఠశాలల నుంచి 1200 మంది గిరిజన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 490 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపి గిరిజన ప్రాంతాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గురుకుల క్రీడా విభాగం ఓఎస్డీ ఎ.శ్యామసుందర్, శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ దేవానంద్, గురుకుల అకాడమీ ఓఎస్డీ రఘునందరావు, సీఐ జి.దేముడు బాబు, స్థానిక ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్. మూర్తి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సుందరరావు, భాస్కరరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సారా పులుపు ధ్వంసం



సారా పులుపును ధ్వంసం చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి సుబ్బారాయుడుపాలెం సరుగుడు తోటల్లోని సారా బట్టీలపై పట్టణ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు టౌన్ సీఐ నమ్మి గణేష్, సిబ్బందితో కలిసి సరుగుడు తోటల్లోని సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచి 500 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే పాత్రలను స్టేషన్‌కు తరలించారు. సారా అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ గోవిందరావు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

ఉధృతంగా వాగులు, గెడ్డలు



కొయ్యూరులో వట్టిగెడ్డ ఉధృతితో నిలిచిన రాకపోకలు

రాజవొమ్మంగి: మండలంలోని మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం పూట కాస్త తెరిపి ఇచ్చినా.. మధ్యాహ్నం సమయంలో రెండు నుంచి మూడు గంటల పాటు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనానికి అడ్డంకిగా మారాయి. మండలంలో బుధవారం 53.2 ఎంఎం వర్షపాతం నమోదు కాగా, సాయంకాలం అంతకు మించి భారీ వర్షం కురిసింది. మంగళవారం మండలంలో 33.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. దీంతో గెడ్డలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో చేరిన వర్షపునీటిని దిగువకు పంపే పనుల్లో రైతుల్లో నిమగ్నమయ్యారు. రహదారులు జలమయమవడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

ఉరుములు, మెరుపులతో భయాందోళన

కొయ్యూరు: గంటపాటు ఉరుములు ఉరమడంతో ప్రజలు బెంబేలెత్తారు. పిడుగుల శబ్దాలతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. తరువాత మేఘాలు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఉరములు, పిడుగు శబ్దాలతో స్థానికులు భయపడ్డారు. రహదారులు జలమయమయ్యాయి. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గడిచిన నాలుగురోజులుగా ఇదే మాదిరిగా మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గెడ్డలు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈదురుగాలులకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై చెట్టు కూలింది. ఎటువంటి ప్రమాదం జరగలేదు. వట్టికాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డుపై వర్షపునీరు చేరడంతో వాహన రాకపోకలు రెండు గంటలపాటు నిలిచిపోయాయి. కాకరపాడు నుంచి కొయ్యూరు వెళ్లే వాహనాలకు ఆటంకం కలిగింది. అనంతరం గెడ్డ ఉధృతి తగ్గడంతో రాకపోకలు సాగాయి.



రాజవొమ్మంగిలో పొలాల మధ్య నుంచి ప్రవహిస్తున్న కొండకాలువ

సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి



అరకులోయ: జిల్లాలోని అవసరమైన చోట సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న అల్లూరి జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. పర్యాటక ప్రాంతాలు, వారపు సంతలు, జన సమూహాలున్న ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి బోర్డు డైరెక్టర్లు అంగీకరించినట్టు చెప్పారు. దీనిపై సంబంధిత అధికారుల ద్వారా ప్రతిపాదనలు తీసుకుంటామని, అనంతరం సామూహిక మరుగుదొడ్ల పనులు ప్రారంభానికి చర్యలు చేపడతామన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల క్లాప్ మిత్రల జీతాలు అందని పరిస్థితి ఏర్పడిందని, సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు గ్రామ పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి అందించాల్సిన సహకారంపై కూడా చర్చించినట్టు ఆమె తెలిపారు.

గెడ్డలు దాటి.. కొండలు ఎక్కి

- ప్రభుత్వ ఆశయాలే ధ్యేయంగా విధులు
- మారుమూల గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ ఉద్యోగులు
- గంజాయి ప్రత్యామ్నాయ పంటల సాగుపై గిరిజనులకు చైతన్యం



ప్రమాదకర గెడ్డను దాటి గ్రామాలకు వెళ్తున్న బొయితిలి ఎంపీఈవో ప్రశాంత్, వ్యవసాయ అసిస్టెంట్ ప్రీతి తదితరులు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో గంజాయి మహమ్మారిని నిర్మూలించి గిరిజనులంతా ప్రత్యామ్నయ పంటల సాగు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆశయాలే ధ్యేయంగా వ్యవసాయశాఖ, సచివాలయంలోని వ్యవసాయ అసిస్టెంట్లంతా పనిచేస్తున్నారు. జి.మాడుగుల మండలం మారుమూల బొయితిలి పంచాయతీకి చెందిన వ్యవసాయ అసిస్టెంట్ ఆర్.ప్రీతి, మండల వ్యవసాయ విస్తరణాధికారి ప్రశాంత్‌లు పంచాయతీల్లో నిరంతరం పర్యటిస్తు గంజాయి ప్రత్యామ్నయ పంటల సాగుకు గిరిజనులను చైతన్య పరుస్తున్నారు. ఇందులో భాగంగా ప్రమాదకర గెడ్డలను దాటి బొయితిలి పంచాయతీలోని అనేక గ్రామాలను వారు సందర్శించి వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలతో అవగాహన చేపట్టారు. ఆయా గ్రామాల్లోని గిరిజనులంతా గంజాయి సాగును వదిలి పెట్టి వరి, చోడి, ఇతర వాణిజ్య పంటల సాగుకు ఈ ఏడాది ఖరీఫ్‌లో శ్రీకారం చుట్టారు. ఎంపీఈవో ప్రశాంత్, వ్యవసాయ అసిస్టెంట్ ప్రీతి అందిస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు.

మందుబాబులపై కేసు

అనకాపల్లి టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 15 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ బుధవారం పేర్కొన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో మద్యం సేవిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసిన కుళ్లిన కోడిగుడ్లు

డుంబ్రిగుడ: గసభ పంచాయతీ లోగేలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ చేసినట్టు చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పలువురు చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఈ ఏడాది జూన్ 4న, అదే విధంగా ఈనెల 27 చిన్నారులకు కుళ్లిన కోడి గుడ్లు అందజేశారన్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా గుడ్లు పంపిణీ జరుగుతోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన గుడ్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులతో పాటు గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ పీవో నీలమ వద్ద ప్రస్తావించగా, ఇప్పటివరకు తమ దృష్టికి సమస్య రాలేదని, దీనిపై విచారణ చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

నకిలీ కులధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని వినతి



రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

రంపచోడవరం: ఏజెన్సీ ఏడు మండలాల్లో నకిలీ కులధ్రువీకరణ పత్రాలను రద్దు చేస్తూ చర్యలు తీసుకోవాలని, 1/70 చట్టం పటిష్టంగా అమలు పరచాలని కోరుతూ ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ , సాంస్కృతిక సంఘం జిల్లా అధ్యక్షుడు కంగల శ్రీనివాసులు, నాయకులు బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో వాల్మీకి తెగ పేరులో గిరిజనేతరులు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా అర్హులైన గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలోకి అక్రమ వలసలను నిరోధించాలని, గిరిజనేతరులు ఏజెన్సీలో అక్రమ కార్యకలపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బినామీల పేరిట సంపాదించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. ఆదివాసీ నాయకులు బాలురెడ్డి, కృష్ణ, పోతురాజు, వెంకటన్నదొర, పండుదొర, ప్రసాద్‌దొర, రామన్నదొర, రాంబాబు, వరలక్ష్మి, గంగరాజు, తదితరులున్నారు.

భార్యను చంపిన భర్తకు ఐదేళ్ల జైలు



లకే రమేష్

పెదబయలు: భార్యను చంపిన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ తెలిపారు. పెదబయలు మండలం సీకరి పంచాయతీ వెల్లపాలెం గ్రామానికి చెందిన లకే రమేష్ గత ఏడాది జనవరి 14న భార్య లకే సావిత్రి(28) హత్య చేయడంపై పాడేరు డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి నిందితుడు రమేష్‌ను రిమాండ్‌కు తరలించారు. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా కోర్టు లకే రమేష్‌ను ముద్దాయిగా నిర్ధారించి ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

తాండవ నదిలో గల్లంతైన వ్యక్తి మృతి

పాయకరావుపేట: తాండవ నదిలో స్నానం చేస్తుండగా గల్లంతైన వ్యక్తి మృతి చెందినట్టు ఏఎస్‌ఐ గోవింద్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని పెదరామభద్రపురం గ్రామానికి చెందిన ఆచంట సూర్యనారాయణ (47) అనే వ్యక్తి అదే గ్రామంలో ఐదు రోజుల క్రితం ఒక వ్యక్తి చనిపోవడంతో దహన సంస్కారానికి హాజరయ్యాడు. ఈ సందర్భంగా స్నానం చేసేందుకు నదిలో దిగాడు. ఈత రాకపోవడంతో నదిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. బుధవారం పెంటకోట, రాజవరం గ్రామాల మధ్య నది ఒడ్డున శవమై కనిపించాడు. మృతుడు సూర్యనారాయణ తల్లి సూర్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బకాయిలు చెల్లించకుంటే కనెక్షన్లు తొలగిస్తాం



బిల్లులు పరిశీలిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ

చింతపల్లి రూరల్: విద్యుత్ బకాయి బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్లు తొలగిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ కె.త్రినాథ్ తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. విద్యుత్ బకాయిలు కలిగిన దుకాణ సముదాయం, రెంటల్ క్వాటర్స్‌లో కనెక్షన్లు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ.10వేలకు పైగా విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్నాయన్నారు.

మహా నిర్లక్ష్యం

- వంతెన, రోడ్డు నిర్మాణానికి లక్షలాది రూపాయల నిధులు
- పనులు ప్రారంభానికి నోచుకోని వైనం
- గ్రామస్తులకు తప్పని వెతలు



నాటుపడవపై గోస్తనీ దాటి జీలుగులపాడుకు వచ్చిన రొంపల్లి, డీకే పర్తి గ్రామస్తులు

అనంతగిరి: చిలకలగెడ్డ పంచాయతీ జీలుగులపాడు గ్రామ సమీపంలోని గోస్తనీ నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. నాటుపడవపై జీలుగులపాడు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సి వస్తోందని రొంపల్లి, డీకేపర్తి గ్రామస్తులు చెబుతున్నారు. కాశీపట్నంలో బుధవారం వారపు సంతకు ఆయా గ్రామస్తులు నాటుపడవపై వచ్చి సరకులు కొనుగోలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోస్తనీపై వంతెన నిర్మాణానికి 2.20 కోట్లు మంజూరు చేసినా అధికారులు నేటికీ పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు చెబుతున్నారు. జీలుగులపాడు నుంచి రొంపల్లి పంచాయతీకి సుమారు 22 కిలోమీటర్ల రహదారి కోసం ప్రభుత్వం రూ.8.83 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. వర్షాకాలంలోని గోస్తనీ ప్రవహించడంతో రొంపల్లి, డికేపర్తి పంచాయతీల్లో సుమారు 50 గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు



రేఖపల్లిలో మావోయిస్టులకు వ్యతిరేకంగా దర్శమిస్తున్న పోస్టర్లు

అరకులోయ/అనంతగిరి/మారేడుమిల్లి/వై.రామవరం/ వీఆర్ పురం: మావోయిస్టుల కార్యకలాపాలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం పేరిట ప్రచార వాల్ పోస్టర్లు అల్లూరి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దర్శనమిచ్చాయి. మావోయిస్టులారా మా అల్లూరి జిల్లాకు రావొద్దనే నినాదంతో..మావోయిస్టులు చేసిన నష్టాలపై దృశ్యాలు, ప్రస్తుతం మావోయిస్టులు లేనప్పుడు ఉన్న అభివృద్ధి పరిస్థితిని ఫోటోలతో పోస్టర్‌లో ముద్రించారు. మావోయిస్టులారా మీరు మా గ్రామాలకు రావొద్దు.. మా అభివృద్ధిని అడ్డుకోవద్దంటూ పోస్టర్లలో పేర్కొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లిరూరల్: క్షేత్ర సందర్శనలో భాగంగా ప్రాంతీయ పరిశోధన శాస్త్రవేత్తలు బుధవారం మండలంలోని చాడెక, రౌరింతాడ గ్రామాల్లోని పొలాలను సందర్శించారు. వరిలో సోకుతున్న తెగుళ్ల గుర్తించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేంద్రప్రసాద్, పి.జోగారావు, ఏవో కన్నబాబు తదితరులున్నారు.

రాజాధిరాజ వాహనంపై వెంకన్న తిరువీధి



రాజాధిరాజ వాహనంపై స్వామి వారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై కొలువుదీరిన శ్రీకల్కి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం స్వామి వారికి రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. ముందుగా ఉదయం నిత్య కార్యక్రమాలు పూర్తి చేసి బాలభోగ నివేదనలు, విశేష హోమాలు చేశారు. అనంతరం శ్రీసుదర్శన పెరుమాల్‌ను పల్లకిలో అధిష్టించి, ఆలయం, గ్రామంలో ఉన్న అష్టదిక్పాలకులకు బలిహరణలు నిర్వహించారు. తరువాత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని రాజాధిరాజ వాహనంలో వేయింపజేసి గ్రామ తిరువీధి సేవ భక్తిశ్రద్ధలతో జరిపారు. సాయంత్రం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన చేశారు.

విశాఖ ఫారెస్ట్ సర్కిల్ విభజన

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): మూడు జిల్లాలు, ఐదు టెరిటోరియల్, మూడు సోషల్ ఫారెస్ట్రీ డివిజన్లుగా ఉన్న విశాఖపట్నం ఫారెస్ట్ సర్కిల్‌ను విభజించారు. ఈ సర్కిల్‌ను ఆరు జిల్లాలు, ఏడు టెరిటోరియల్, ఒక సోషల్ ఫారెస్ట్రీ డివిజన్‌గా విభజిస్తూ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రామ్మోహనరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా డివిజన్లకు సంబంధించి అధికారులను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా	డివిజన్	ఫారెస్ట్ విస్తరణ (హెక్టార్లు)	అధికారి	మొబైల్ నంబర్
శ్రీకాకుళం	శ్రీకాకుళం	44574.95	నిషా కుమారి	94408 10037
పార్వతీపురం	పార్వతీపురం	107724.57	జి.ఎ.పి.ప్రసూన	94408 10124
విజయనగరం	విజయనగరం	17240.15	ఎస్.వెంకటేష్	94408 10038
విశాఖపట్నం	విశాఖపట్నం	14512.02	అనంత శంకర్	94408 10034
అనకాపల్లి	అనకాపల్లి	78311.86	అనంత శంకర్(ఇన్‌చార్జి)	94408 10036
అల్లూరి	పాడేరు	197871.90	కె.వినోద్ కుమార్	94408 10035
అల్లూరి	చింతపల్లి	197181.02	సీహెచ్ సూర్యనారాయణ	94408 10123
సోషల్ ఫారెస్ట్				
అనకాపల్లి	అనకాపల్లి	అనకాపల్లి రెవెన్యూ	జి.లక్ష్మణ్	94408 10122

క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంటకలక్ష్మి, సర్పంచ్ బొజ్జయ్య రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లుదొర, లక్ష్మి, సీతపల్లి గుడి చైర్మన్ శేఖర్, వైఎస్సార్ పార్టీ నాయకుడు రామకృష్ణ దొర తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



పిల్లలకు పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, అధ్యాపకులు

అరకులోయ: మండలంలోని లిట్టిగుడ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.పద్మలత, అధ్యాపకులు పౌష్టికాహారాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఆంగ్ల, హిందీ విభాగ అధ్యాపకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పౌష్టికాహార వారోత్సవాలు పురస్కరించుకొని చిన్నారులకు పోషకాహారాన్ని అందజేసినట్టు వైస్ ప్రిన్సిపాల్ చెప్పారు. అధ్యాపకులు సుందరీరాణి, విజయలక్ష్మి, గురవయ్య, కామేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ సతీష్‌కు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఎస్ఐను సన్మానిస్తున్న మహిళా పోలీసులు

అరకులోయ : స్థానిక పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ సతీష్‌ను హుకుంపేట పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న ఎస్ఐ సతీష్‌ను మహిళా పోలీసులు, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. మహిళా పోలీసులు విజయ, కాంతమ్మ, ప్రియాంక, తదితరులున్నారు.

మరింత మెరుగ్గా పనిచేయాలి



పెదబయలులో మాట్లాడుతున్న ఏపీడీ గిరిబాబు

పెదబయలు: స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో ఏపీడీ కె.గిరిబాబు బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది మరింతా మెరుగ్గా పనిచేయాలని, ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పనతో పాటు వారికి సకాలంలో వేతనాలు అందించడానికి కృషి చేయాలన్నారు. ఉపాధి పనులపై పూర్తిస్థాయిలో అవగాహన, కూలీల బ్యాంకు ఖాతా నంబర్లు తప్పుగా నమోదు చేయడంతో వేతనాలు సక్రమంగా జమ కావడం లేదన్నారు. సకాలంలో ఇచ్చిన పనులు పూర్తి చేయాలని, పని వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, హార్టీకల్చర్ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలని, జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయాలని కోరారు. ఏపీవో మూర్తి, ఈసీ సింహాచలం, సీవోలు, టిఏలు, పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం ఇస్తున్న వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు

గూడెంకొత్తవీధి: ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వర రాజును వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని శివారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జోరుగా వ్యాపారం.. రైతుల ఆనందం

- మన్యంలో వాతావరణం అనుకూలం
- ఆశాజనకంగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు
- చిన్నబంతి పూలకు గిరాకీ
- కూరగాయల మంచి మార్కెట్



బంతిపూల పూత



తూటంగిలో క్యాబేజీ పంట

సాక్షి, పాడేరు : ఏటా విజయదశమి పండగ నుంచి సంక్రాంతి వరకు మన్యంలో చిన్న బంతిపూల దిగుబడి ఉంటుంది. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో బంతి తోటలకు పూత ఏర్పడింది. పూలు విరగ్గాస్తుండడంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నవరాత్రుల సమయంలోనే మన్యం బంతిపూలకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. దసరా పండగకు రెండు రోజుల ముందు బంతిపూల ధరలు అధికంగా ఉంటాయి. పాడేరు మండలం బరిసింగి, డోకులూరు, డి.గొందూరు, ఇరడాపల్లి, గబ్బంగి, గుత్తుల పుట్టు, జి.ముంచంగిపుట్టు, పెదబయలు మండలంలోని పెదకోడాపల్లి, గంపరాయి, హుకుంపేట మండలంలోని మఠం, శోభకోట, హుకుంపేట, గడికించుమండ, బారాపల్లి, సూకూరు, సంతారి, కొట్నాపల్లి పంచాయతీల్లో గిరిజన రైతులు సీతమ్మకాటుక రకం(చిన్నబంతి) పూలను సాగు చేస్తుంటారు. ఈ పూలసాగుకు ఆయా గ్రామాలు ప్రసిద్ధి చెందాయి. పూల వ్యాపారంతో రైతులు లాభాలు పొందుతుంటారు. దసరా సమయంలో బుట్ట బంతిపూలు రూ.150 నుంచి రూ200 వరకు అమ్మకాలు జరుగుతుండగా, కార్తీక మాసంలో బుట్ట రూ.100తో వ్యాపారం జరుగుతుంది. పాడేరు పాతబస్టాండులో సంక్రాంతి పండగ వరకు పూల మార్కెట్ జరుగుతుంది. ఇక్కడ కొనుగోలు చేసిన బంతిపూలను విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాలకు తరలించి వ్యాపారులు రిటైల్‌గా అమ్మకాలు జరుపుతారు. బంతిపూల సాగు రైతులకు ఆదాయం ఇస్తుండగా వ్యాపారులకు కూడా మంచి లాభాలు అందిస్తున్నాయి. ఈ ఏడాది కూడా దసరాకు గిరిజన రైతులు బంతిపూలను సిద్ధం చేస్తున్నారు.

విస్తారంగా బొబ్బర్లు, సామ సాగు

డుంబ్రిగుడ: కిల్లోగుడ, సాగర, పరిడి, సొవ్వా, కోల్లాపుటు, గుంటసీమ, దొర్రగుడ, కుజ్జభంగి,రంగిలిసింగి,లైగండ,తూటంగి, కించుమండ తదితర గిరిజన గ్రామాల్లో విస్తారంగా పెద్ద సామ పంటలను అధికంగా సాగుచేస్తున్నారు. గతేడాది 300 ఎకరాల్లో సాగు పంట సాగు చేయగా ఈ ఏడాది 500 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. మైదాన ప్రాంతంలో మన్యంలో పండించే సాములు మంచి డిమాండ్ ఉండడంతో ఎక్కువగా సాగు చేస్తున్నట్టు చెబుతున్నారు. దీంతో పాటు బొబ్బర్లు, క్యాబేజీ, టమాటా తదితర పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 210 ఎకరాలు, బొబ్బర్లు 180 ఎకరాల్లో, టమాటా 280 ఎకరాల్లో పండిస్తున్నారు. వారపు సంతల్లో కిలో సాములు రూ.18 నుంచి రూ.22 వరకు, బొబ్బర్లు కిలో రూ.25 నుంచి రూ.32 వరకు, క్యాబేజీ 50 కిలోల బస్తా రూ.800 నుంచి రూ.1200 వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని, గిట్టుబాటు ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లంపీ వ్యాధి నివారణపై అవగాహన



లంపీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి



బిర్సింగిలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో పశువైద్యాధికారి చరణ్ తదితరులు



మోహనాపురంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: పశువులకు లంపీ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి, విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ముంచంగిపుట్టు మండలం జర్రెల పంచాయతీ మండిభ గ్రామంలో కిలగాడ పశువైద్యాధికారి ఎం.సౌజన్యదేవి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 117 పశువులకు చికిత్స చేశామన్నారు. ముంచంగిపుట్టు పశువైద్యాధికారి భాస్కరరావు ఆధ్వర్యంలో లబ్బూరు, గుమ్మసిరగం పుట్టు, తలబిరడ పశు విజ్ఞాన బడి కార్యక్రమం ద్వారా గిరిజనులకు లంపీ వ్యాధిపై అవగాహన కల్పించారు. సిబ్బంది అనురాధ, ధర్మరావు, రామనాయుడు, రాజు, బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: సూకురు పంచాయతీ బిర్సింగి గ్రామంలో హుకుంపేట, పాడేరు పశు సంవర్ధక శాఖాధికారులు చరణ్, రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పశు వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లంపీ వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశువులకు అనారోగ్య సమస్యలుంటే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. బాకురు, డోకులూరు పశువైద్యాధికారులు వరప్రసాద్, సతీష్, సిబ్బంది అనిల్, సన్యాసి తదితరులున్నారు.

800 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

గంగరవరం : మోహనాపురంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ అక్కమ్మ బుధవారం ప్రారంభించారు. నెల్లిపూడి పశువైద్య శాల జూనియర్ వెటర్నరీ అధికారి అప్పన్నబాబు సుమారు 800 పశువులకు వ్యాధి నిరోదక టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది వెంకటేశ్వర్లు, కీర్తన, బషీర్, గౌతమి తదితరులున్నారు.

బాధిత రైతులకు సాయం



నగదు సాయం అందజేస్తున్న ఎంపీపీ బోయిన కుమారి

గూడెంకొత్తవీధి : పిడుగుపాటుకు పశువులు మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం పరామర్శించారు. దోనుగుమ్ముల గ్రామంలో భారీ వర్షానికి గ్రామానికి వంతాల సన్నుదొర్‌కు చెందిన మూడు పశువులు, గొల్లూరి జగన్నాథానికి చెందిన-3, కిల్లో నీలో-2, కిల్లో సుబ్బారావు, కొర్ర రమణకు చెందిన ఒక పశువు మొత్తం పది పశువులు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడగా, ఈ సంఘటనలో పశువుల కాపరి గొల్లూరి నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎంపీపీ కుమారి, పార్టీ నాయకులు బాధిత రైతులను కలిసి నగదు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కుమారి మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటామన్నారు. సంఘటన స్థలానికి చేరుకునేందుకు ఎంపీపీ తదితరులు కొండలు గుట్టలు ఎక్కి కాలినడకన వెళ్లారు. ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు, నేతలు అరుణ్, బాబి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

అడ్డతీగల: మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నట్టు స్పందన రూరల్ డవలప్‌మెంట్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.పద్మజారెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 20 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆరు నెలలకు ఒక విడతగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి, శిక్షణ పొందిన వారికి కుట్టు మిషన్లు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఎస్ఐ అప్పలరాజు, సంస్థ ప్రతినిధులు ప్రదీప్‌వర్మ, చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్‌తో ముప్పు



అవగాహన కలిస్తున్న సీఐ సత్యనారాయణ

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, ఆపరేషన్ పరివర్తన్ అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాసరావు బుధవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ లోన్‌ల యాప్‌లను డౌన్‌లోడు చేసుకోవద్దని, వాటితో జీవితాలకు ముప్పు అన్నారు. గంజాయి సాగు, రవాణా నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో గంజాయి సాగు ఉంటే ఫోటో తీసి, సమాచారాన్ని ఎంపీడీవో, పోలీసులకు అందించాలని సూచించారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ లేకుండా ప్రయాణించొద్దన్నారు. బైక్‌పై ఇద్దరికన్నా ఎక్కువ మంది వెళ్తున్నా, అతి వేగంగా నడిపినా ఫోటో తీసి సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారాన్ని చేరవేయాలన్నారు. ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: రావణాపల్లిలో సీఐ స్వామినాయుడు మంగళవారం రాత్రి సందర్శించి, రుణ యాప్‌ల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కలిఽంచారు. ఆన్‌లైన్ లోన్ తదితర యాప్‌లలో వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా తదితర వివరాలను పొందుపరచవద్దని సూచించారు. తీసుకున్న రుణాలపై ఎవరైనా ఇబ్బందులు పెడుతుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

నిస్వార్థ సేవలతో గుర్తింపు



గౌరీ శంకర్ దంపతులను సన్మానిస్తున్న ఐపీవో ఉపేంద్ర

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల పోస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ పొందిన అడుగులపుట్టు ఏబీపీఎం పిచ్చుక గౌరీశంకర్ వరప్రసాద్‌ను సన్మాన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపీవో బి.ఉపేంద్ర మాట్లాడుతూ ఉద్యోగులు వృత్తిలో అంకితభావం, నిజాయితీ, నిస్వార్థంగా పనిచేస్తే సమాజంలో ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. ఏబీపీఎం వరప్రసాద్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన ఏబీపీఎం వరప్రసాద్, రాజ్యలక్ష్మి దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. బీపీఎంలు, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు సమక్షంలో పనులు చేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వం నుంచి విడుదలైన ప్రతి పథకాన్ని ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. మండల అభివృద్ధికి నాయకులు, అధికారులు సమష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



శిక్షణ పొందుతున్న మహిళలు

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త కె.రాజేంద్రప్రసాద్, కెవీకె కో-ఆర్డినేటర్ పి.లలితాకామేశ్వరి మాట్లాడుతూ మహిళలు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కెవీకె మత్స్యశాఖ శాస్త్రవేత్త కె.వీ రాంజనేయులు మాట్లాడుతూ చేపలు, రొయ్యలు మార్కెట్ తక్కువగా ఉన్నప్పుడు వాటిని కొనుగోలు చేసి విలువ ఆధారిత ఉత్పత్తులైన పచ్చళ్లు, కట్‌లెట్స్ తదితర వంటకాలతో మార్కెట్ చేసుకొని లాభం పొందవచ్చన్నారు. మూడు రోజులు పాటు జరిగే శిక్షణలో తొలిరోజు రొయ్యల పచ్చడి తయారీ విధానాన్ని మహిళలకు వివరించారు.

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

అరకులోయ: గిరిజనేతరుల దౌర్జన్యాల నుంచి ఆదివాసీలను కాపాడాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు. గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో జేఏసీ నేతలతో బుధవారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చొంపి సర్పంచ్ దీనబంధుపై దాడికి పాల్పడిన నందీశ్వరరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ ధ్రువపత్రాలతో గిరిజనేతరులు చలామణీ అవుతున్నారని, దీంతో గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, ఉన్నతాధికారులు స్పందించాలన్నారు. సర్పంచ్‌పై దాడి ఘటనపై వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం రేపు

రాజవొమ్మంగి: కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు తదితర అంశాలపై రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వై.వి.సుబ్రహమణ్యాచారి చెప్పారు. సబ్ కలెక్టర్ సింహాచలం ఆదేశాల మేరకు రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో పోలింగ్ బూత్‌లు, ఓటర్ల జాబితా మార్పులు, శిథిలదశకు చేరిన పోలింగ్ సెంటర్ల మార్పు తదితర విషయాలను చర్చించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నిఎ–ార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం

హుకుంపేట: సతకంపట్టు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీటీసీ సభ్యులతో కలిసి జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పోషకాహారంతోనే ఆర్యోగం చేకూరుతుందని, కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు సుశీల, రజిని, కొండమ్మ, మీనా, సర్పంచ్ వెంకటపూర్ణిమ, నాయకులు సూరిబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



రేఖపల్లిలో విత్తనాలను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ భవానీ

వీఆర్ పురం: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రభుత్వం రాయితీపై అందించిన మినుము, పెసర విత్తనాలను వైస్ ఎంపీపీ భవానీ తదితరులు రైతులకు బుధవారం పంపిణీ చేశారు. ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, సర్పంచ్ సరోజినీ, ఏఓ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు ప్రారంభం



పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

చింతపల్లి రూరల్: తమ్మంగుల పంచయితీ కె.ఎ స్.దుర్గం గ్రామంలోని పాఠశాలలో నాడు-నేడు పనులకు జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పూసలపాలెం నుంచి దానుడివీధికి నిర్మించనున్న రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌లు కాంతమ్మ, లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవి, హెచ్ఎం శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కుంకుమ పూజలు



గాయత్రిదేవి అలంకరణలో దుర్గమ్మ

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి, దూసరపాము, రాజవొమ్మంగి, శరభవరం, కొండపల్లి, సూరంపాలెం, తండికొండ తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి కనిపిస్తోంది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులు పూజలు చేస్తున్నారు. దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని గాయత్రిదేవీ రూపంలో అలంకరించారు. భవా నీ మాలధారులు, భక్తు లు భజనలు చేస్తున్నారు. తంటికొండ గ్రామంలో వెలసిన దుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు కుంకుమార్చన జరి పారు. ఆంధ్ర వన వాసి ధర్మరక్ష సమితి (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

నేడు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

కొయ్యూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరగనున్న వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని ఎంపీడీవో మేరీరోజ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు చెక్కు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, అధికారులు, స్థానిక ప్రజాప్రతనిధులు హాజరుకావాలని కోరారు.

అడ్డతీగల: అడ్డతీగలలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొననున్నట్టు అడ్డతీగల సొసైటీ చైర్మన్ తోట రాజేశ్వరరావు తెలిపారు.మండల కేంద్రమైన అడ్డతీగలలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాజవొమ్మంగి, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల మండలాలకు మూడవ విడత వైఎస్సార్ చేయూత చెక్కులు అందించనున్నారన్నారు. అనంతరం అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాల, సీతారామరాజు కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నాడు-నేడు పథకం కింద మంజూరైన భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తారని తెలిపారు.

జేజేఎం కమిటీల నియామకం

జి.మాడుగుల: సింగర్బ పంచాయతీ రోలంగిపుట్టు గ్రామంలో సర్పంచ్ కొండమ్మ అధ్యక్షతన జల్ జీవన్ మిషన్ పనులపై అవగాహన, వీడబ్ల్యూయూఎస్సీ కమిటీల నియామకం బుధవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయి పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. పాడేరు డివిజన్ జెజెఎం కో-ఆర్డినేటర్ మాణిక్యం, ఎంఆర్‌సీ సావిత్రి, మండల కో-ఆర్డినేటర్ రామ్మూర్తి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే ప్రజా సమస్యల పరిష్కారం



ఆదివాసీల ఐక్యతను చాటుతూ నినదిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు

అడ్డతీగల: ఐక్యతతోనే సమస్యల సాధన సాధ్యమౌతుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్లె రవికుమార్‌రెడ్డి అన్నారు.అడ్డతీగల మండలం డి.భీమవరంలో బుధవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గిరిజనులతో సమావేశం నిర్వహించారు.

ఆదివాసీ చట్టాలు, జీవోలపై వివరించారు .ప్రతి సమస్యను ఐక్యతతోనే సాధించుకోవచ్చన్నారు.తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. విద్యతోనే హక్కులుకు రక్షణ ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కార్యవర్గ సభ్యురాలు గొర్లె వీరులమ్మ,పాలోజు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ బందం శ్రీదేవి

రంపచోడవరం: స్థానిక జూనియర్ కళాశాలలో జరుగుతున్న క్రికెట్ టోర్నీను ఎంపీపీ బందం శ్రీదేవి బుధవారం సందర్శించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. టోర్నీలో 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీటీసీలు తదితరులున్నారు.

బకాయిల వసూళ్లకు చర్యలు

కొయ్యూరు: స్థానిక గ్రామీణ బ్యాంకు అనకాపల్లి జిల్లా ఏపీజీవీబీ ఆర్ఎం ఉదయ్‌కిరణ్ బుధవారం సందర్శించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని బీఎం సతీష్‌కుమార్‌ను కోరారు. బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక బీమా పథకాల్లో ఎక్కువ మందిని చేర్చాలని సూచించారు.